రైతులకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే నాగమాధవి

విశాలాంధ్ర-డెంకాడ: రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మండలంలోని గుణుపూర్ గ్రామంలో గత వారం రోజులుగా తుఫాను కారణంగా దెబ్బతిన్న పొలాలను శనివారం నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తుఫాను కారణంగా దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు ఈ సందర్భంగా రైతులకు దెబ్బతిన్న తడిచిన మొలకెత్తిన,రంగు మారిన ధాన్య%శీ%ను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుంది అని ఎమ్మెల్యే తెలియజేశారు. అలాగే రైస్ మిల్లర్స్ తీసుకెళ్లినటువంటి ధాన్యంకు ఇబ్బంది పెడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పి నిర్మల ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు మాజీ ఎంపీపీ చంద్రశేఖర రావు, కంది సూర్యనారాయణ కలిదిండి పాణిరాజు తెలుగుదేశం జనసేన నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు పరిష్కారం : కలెక్టర్ డా. బీఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-ఎస్.కోట రూరల్ : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమ స్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. ఎస్.కోట మండలంలో కలెక్టర్ శుక్రవారం పర్యటించారు. మండలంలోని దాంపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వచ్చిన వినతుల్లో అవకాశం ఉన్న వాటికి క్షేత్రస్థాయిలో పంచనామా నిర్వహించి, రికార్డులను పరిశీలించి వారి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వినతులను తీసుకున్న వెంటనే, సంబంధిత రికార్డులను తనిఖీ చేసి, వీలైనంతవరకు అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. గ్రామంలోని ఇతర సమస్యలను కలెక్టర్ తెలుసుకున్నారు. నెలరోజులుగా బోరు పనిచేయకపోవడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయితీ కార్యదర్శిపై చర్య తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ దీపాలు పనిచేయడం లేదని, విద్యుత్ స్థంబాన్ని మార్చాలని గ్రామస్తులు కోరారు. తక్షణమే గ్రామంలో పర్యటించి, సాయంత్రానికల్లా వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా పంచాయితీ అధికారిని ఆదేశించారు. శ్మశానానికి వెళ్లే మార్గంలో కల్వర్టును నిర్మించాలని గ్రామస్తులు కోరగా, ఉపాధిహామీ పథకం క్రింద గ్రామంలో తీర్మాణం చేసి పంపిస్తే, దానిని మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఆర్‌డిఓ డి.కీర్తి, తాసిల్దార్ అరుణకుమారి, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రాయపూర్ హైవే బాధిత రైతులకు అదనపు పరిహారం ఇస్తాం: జామి రైతులకు కలెక్టర్ హామీ

విశాలాంధ్ర-విజయనగరం: విశాఖ-రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్130సిడి) నిర్మాణంలో భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వ పరంగా ఇవ్వాల్సిన 30శాతం అదనపు పరిహారాన్ని త్వరలోనే అందజేస్తామని జిల్లా కలెక్టర్ డా. బిఆర్. అంబేద్కర్ రైతులకు హామీ ఇచ్చారు. కొద్ది రోజుల క్రితం జామికి చెందిన బాధిత రైతులు జిల్లా గ్రీవెన్స్‌లో తమ ఆవేదన వెల్లడించారు. అయితే ఈనెల 28న తనను రైతులు కలవాలని కలెక్టర్ సూచించారు. దీంతో శనివారం మొత్తం 4ఎకరాల45 సెంట్లుకు సంభందించిన 29మంది రైతులు కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిసారు. వారి సమస్యను తెలుసుకున్న కలెక్టర్ మీకు అందాల్సిన పరిహారాన్ని ఇస్తామని, ఆందోళన చెందవద్దని సూచించారు. కలెక్టర్ హామీతో రైతులు సంతోషం చెందారు. గత కొన్నాళ్ళుగా రైతులు పరిహారం విషయంలో అధికారుల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. చివరకు జిల్లా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఎట్టకేలకు కలెక్టర్ తమ సమస్యపై దృష్టి సారించారని ఆనందం వ్యక్తం చేసారు.

30 న అమిత్ షా రాజీనామా కోరుతూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు : వామపక్ష నేతల పిలుపు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : అంబేద్కర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30 తేదిన జిల్లాలో అన్ని మండల,ప్రధాన కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆందరావు లు తెలిపారు. శనివారం స్థానిక ఎల్ బి జి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... అంబేద్కర్ పేరు కంటే దేవుడిని తలచుకుంటే పుణ్యం వస్తుందని అమిత్ షా అనడం అంటే రాజ్యాంగాన్ని అవమానించడం అన్నారు.రాజ్యాంగ నిర్మాత,రూపకర్త అయిన అంబేద్కర్ నీ అవమానించే విధంగా మాట్లాడటం దారుణమన్నారు. దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి అన్నారు. అర్ఎస్ ఎస్,బిజెపి రాజ్యాంగ నిర్మాతనుఅవమానించే విధంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ప్రపంచానికి ఆదార్శమైన రాజ్యాంగాన్ని రచించిన వ్యక్తి పై అనుచితంగా మంత్రిగా ఉండి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అంబేద్కర్ ను అవమానించడం అంటే దేశ ప్రజలను, రాజ్యాంగాన్ని అవమానించడమే అన్నారు. కులంకార వ్యాఖ్యలకు ఇది నిదర్శనమన్నారు. అదే రాజ్యాంగం లేకుంటే మీరు ఈ రోజు అనుభవిస్తున్న పదవులు ధక్కేవా అని అన్నారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ 30 తేదిన జిల్లాలో అన్ని ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని వాటిలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నిరసన కార్యక్రమాలు గోడ పత్రికను విడుదల చేశారు.విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు పాల్గొన్నారు.

అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజినీరింగ్ కాలేజీలో ప్రతిభ పరీక్ష పోస్టర్ విడుదల

విశాలాంధ్ర-గరివిడి : స్థానిక గరివిడి అవంతీన్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం మధ్యాహ్నం పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఆదివారం ప్రతభ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ గారు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ మంత్రివర్యులు,అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు గారు చేతులు మీదుగా పోస్టర్ విడుదల చేశారు.మరియు మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న ప్రతిభను వెలికితీయటానికి ఇటువంటి ప్రతిభ పరీక్షలు ఎంతగానో దోహదం చేస్తాయని మరియు కాంపిటీషన్ స్పిరిట్ ను ప్రోత్సహించటానికి ఉపయోగపడుతుందని తెలిపారు.ఇటువంటి ప్రతిభ పరీక్షలు ఇకనుండి ప్రతీ సంవత్సరం వుంటాయిని ఈ సందర్భంగా తెలియజేశారు.మరియు ప్రిన్సిపాల్ గారు మాట్లాడుతూ ఈ పరీక్ష పదవ తరగతి మాథ్స్,ఫిజిక్స్ మరియు కెమిస్ట్రీ సబ్జెక్టులపై ఆబ్జెక్టివ్ టైప్ క్వశ్చన్స్ ఉంటాయిని తెలిపారు.ఈ ప్రతిభ పరీక్షలో మార్కులు ఆధారంగా ప్రథమ,ద్వితీయ మరియు తృతీయ బహుమతులు ఉంటాయిని తెలియజేసారు.కావున అర్హత ఉన్న ప్రతి విద్యార్థి ఈ ప్రతిభ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రతిభ పరీక్ష వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :8121987431,83176 86432,83091 99291.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ,ఏఓ జి.అనిల్ కుమార్,వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జనసేన ఆర్థిక సాయం

విశాలాంధ్ర-భోగాపురం : మండలంలో ఏ రావివలస పంచాయితీ, అమటాం గ్రామానికి చెందిన దువ్వ అప్పన్న పుశువుల పాక దగ్ధమైన విషయం తెలిసిందే. పశువుల పాక యజమాని దువ్వ అప్పన్న కుటుంబాన్ని జనసేన నాయకులు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. భోగాపురం మండల జనసేన అధ్యక్షులు వందనాల రమణ , ఏ రావివలస పంచాయితీ జనసేన నాయకులు దల్లి శ్రీను, అమటాం గ్రామ జనసేన నాయకులు కోరాడ వెంకట రమణలు బాధిత కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ మాస్టారు, బొల్లి త్రినాథ్, రాధా రెడ్డి, శంకర్, దువ్వ రామసూరి, నొడగల బంగారప్పుడు, దల్లి రవి, ఉప్పాడ నాగరాజు, కొయ్య రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులు బాధ్యత గా పనిచేయాలి

రిఫరల్స్ ను తగ్గించాలి - కలెక్టర్ డా. అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: వైద్యాధికారులు గ్రామాల్లో ఆరోగ్య పరిస్థితుల్ని తెలుసుకొని వాటికి తగ్గట్టుగా బాధ్యతగా పని చేయాలనీ జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ప్రజల ఆరోగ్యం పై అర్థం చేసుకోకుండా లేని పోని వదంతులను సృష్టించడం, ఏదైనా సంఘటన జరిగినా పక్క వారి మీదతోసేయడం వంటివి చేస్తే ఉపేక్షించేదిలేదని స్పష్టం చేసారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియం లో వైద్యాధికారులతో సమీక్షించారు. గత మూడు నెలలుగా దయేరియా అంశం జిల్లాను పట్టి పీడిస్తోందని, ప్రజల సందేహాలను నివృత్తి చేసేలా వాస్తవాలను వెల్లడించి నమ్మకం కలిగించాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగు నీరు , క్లోరినేషణ్ , ఆరోగ్య పరిస్థితుల పై దృష్టి పెట్టాలని, తెలిపారు. గుర్లలో దయేరియా అనంతరం జిల్లాలో డ్రైనేజి లలో నున్న పైప్ లైన్లనన్నిటిని బయటకు తీయడం జరిగిందని ప్రస్తుతం నీటి కాలుష్యం అనేదే లేదని, ఇంకోసారి దయేరియా కు నీటి కాలుష్యం కారణం అనే వార్త వినపడకూడదని తెలిపారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చూసే బాధ్యత కూడా వైద్యాధికారులదేనని అన్నారు. ఆసుపత్రులకు వచ్చే వారిని తప్పనిసరి అయితేనే రెఫెర్ చేయాలనీ, రెఫరల్ కేసులు తగ్గాలని సూచించారు. రిఫర్ చేయడానికి గల కారణాలు సంతృప్తిగా ఉండాలని, పేషెంట్ ను వదిలించుకోడానికి ప్రయత్నం చేయకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్య తగా పని చేయాలనీ, వైద్యుల పై ఫిర్యాదులు వస్తే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. ఈ సమావేశం లో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రాణి, డిసిహెచ్ ఎస్‌డా.రాజ్యలక్ష్మి, జిజిహెచ్, మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ లు, పి హెచ్ సి, సి.హెచ్ సి ల వైద్యాధికారులు పాల్గొన్నారు.

జనవరి ఒకటి నుండి ప్లాస్టిక్ నిషేధానికి పకడ్బందీ ఏర్పాట్లు

విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : జనవరి ఒకటవ నుండి నగరంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధానికి పకడ్బందీ వ్యూహరచనతో సాగుతామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన చాంబర్ లో రిటైల్ మరియు హెూల్ సేల్ ప్లాస్టిక్ విక్రేతలతో సమావేశమయ్యారు. సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధానికి విక్రయదారులు పరిపూర్ణ సహకారం అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విక్రయదారులకు ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మానవాళి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని నగరం నుండి తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. అలాగే 120 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వస్తువులు కచ్చితంగా నిషేధిస్తున్నామని అలాగే 120 మైక్రాన్ల కన్నా ఎక్కువ ఉన్నా గాని సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులను కూడా విక్రయించరాదని తెలిపారు. దుకాణదారులు ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తేనే ప్రజల వినియోగిస్తారన్న విషయాన్ని గ్రహించాలన్నారు. విక్రయదారులకు ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలను గుర్చి వివరించారు. ప్రస్తు తం ప్రత్యేక ప్రత్యామ్నాయ వస్తువులు అందుబాటులోకి వచ్చాయని, వాటిని విక్రయిం చినట్లయితే పర్యావరణానికి ఎంతో మేలు కలుగుతుందని వెల్లడించారు. ఏ విధమైన వస్తువులు అమ్మవచ్చు, ఏ వస్తువులు అమ్మకూ డదన్న విషయమై సోదాహరణగా వివరించారు. అందుకు విక్రయదారులు కూడా తమ సమ్మతాన్ని తెలిపారు. ఇక నుండి ప్రతిరోజు సర్కిళ్ళ వారీగా ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు నిర్వహిస్తామని ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. పర్యావరణానికి, మానవాళి మనుగడకు ప్రశ్నార్థకంగా మారనున్న ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా నిషేధించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి,పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, రవిశేఖర్,హెూల్‌సేల్, రిటైల్ ప్లాస్టిక్ వ్యక్రయదారులు పాల్గొన్నారు.

మామిడి రైతులు ఈ నెల 31లోగా పంట బీమా నమోదు చేసుకోవాలి

ఉద్యాన అధికారి లక్ష్మీ నారాయణ

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలోని మామిడి రైతులు ఈ నెల 31లోగా పంట బీమా నమోదు చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి పిఎన్‌విలక్ష్మీనారాయణ సూచించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ మామిడి పంటకు వాతావరణ ఆధారిత బీమా పథకంలో అవకాశం కల్పించిన ప్రభుత్వం ప్రీమియం, గడువు, భీమ వర్తింపు అంశాలను ప్రకటించడం జరిగిందన్నారు. విజయనగరం జిల్లాలో మామిడి పంటకు పునర్వ్యవస్తీకరించబడిన వాతావరణ పంటల ఆధారిత పంట బీమా పథకాన్ని అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ అఫ్ ఇండియా సంస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బీమా చెల్లించేందుకు ఒప్పందం చేసుకుందని వివరించారు. ప్రభుత్వాల సహకారంతో కాలానుగుణంగా వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పులతో పంట నష్టం వలన కలిగే ఆర్థిక నష్టాల నుండి రైతులను ఆదుకోవడం కోసం రబీ 2024-25 లో మామిడి పంటకు బీమా అమలు చేయడం జరిగిందన్నారు. బీమా ప్రీమియం కింద మామిడి రైతులు ఎకరాకు రూ. 2,000లను ఈ నెల 31 వ తేదీలోగా చెల్లించవలసినదిగా గడువు నిర్ణయించడమైందన్నారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ అఫ్ ఇండియా సంస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రకృతి వైపరీత్యాల వల్ల (పంట దెబ్బ తింటే) ఎకరాకు రూ. 40,000 బీమా వర్తిస్తుంది. ఈ బీమా కాలపరిమితి 15 డిసెంబర్ 2024 నుండి 31 మే 2025 వరకు ఉంటుందన్నారు. ఈ మధ్య కాలంలో అధిక వర్షం, గాలిలో తేమ శాతం, వాతావరణ వ్యత్యాసం, అధిక గాలులు తదితర కారణాలతో నష్టం వాటిల్లితే ప్రభుత్వ నిబంధనల మేరకు నష్టం అంచనా వేసి బీమా వర్తిస్తుందన్నారు. బీమా పొందగోరు రైతులు వారికీ దగ్గరలో ఉన్న సిఎస్‌సి(కామన్ సర్వీస్ సెంటర్) (మీ సేవ)ను సంప్రదించవచ్చు, లేదంటే రైతులు నేరుగా మొబైల్ ద్వారా కూడా బీమా పొందవచ్చన్నారు. దీనికి కావలసిన పత్రాలు అనగా బ్యాంకు ఎకౌంటు జిరాక్స్, ఆదార్ కార్డు జిరాక్స్, భూమి పాస్ బుక్ జిరాక్స్ ఇచ్చిన పంట సాగు ధృవీకరణ పత్రములు ఉండాలని తెలిపారు. తగు సమాచారం కొరకు మీ సంబందిత రైతు సేవ కేంద్ర సిబ్బందిని,ఉద్యాన అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఏకగ్రీవంగా మండల పరిషత్ సవరణ అంచనా బడ్జెట్

విశాలాంధ్ర -గజపతినగరం: గజపతినగరం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సవరణ అంచనా బడ్జెట్ ఏకగ్రీవంగా ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక అధ్యక్షతన జరిగింది. ఈ బడ్జెట్ సమావేశంలో ఎంపీడీవో కళ్యాణి మాట్లాడుతూ సవరణ అంచనా బడ్జెట్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 2024 బి25 బడ్జెట్ 2025బి26 అంచనా బడ్జెట్ ను సభలో ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు ఈ సమావేశంలో జడ్పిటిసి ఏవో పుష్ప వివిధ శాఖలకు చెందిన అధికారులు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పెరుమాలిలో కాలువల్లో పూడికతీత పనులు

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో ఎరుమాలి గ్రామంలో సర్పంచ్ ప్రతి నిధి ఎస్.ఏఎస్. రాజు పంచాయితీ కార్యదర్శి బి.వెంకట్ పర్యవేక్షణలో పెరుమాలి గ్రామం లోని అన్ని వీధులలో కాలువ పూడికతీతలు తీయించడం జరుగుతుంది.ఇందుకుగాను గ్రామంలో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీజెపి మండల అధ్యక్షునిగా మన్నె పూరి ఏకగ్రీవం

విశాలాంధ్ర-మెంటాడ: శనివారం మెంటాడ మండలం జయితి గ్రామంలో బారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు నామినేషన్ ప్రక్రియలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేయగా మండలంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడుగా ఒకే ఒక నామినేషన్ వేయడంతో మండల పార్టీ అధ్యక్షులుగా మన్నెపూరి అప్పలనాయుడు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. రిటర్నింగ్ అధికారి గొర్లె భానోజీరావు జిల్లా కార్యదర్శి తాడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యంలో మండల బిజెపి పార్టీ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అన్నారు.పార్వతిపురం మన్యంజిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు నూతన మండల అధ్యక్షులు మన్నెపూరి అప్పలనాయుడుకి ఎన్నికల ధృవనికరణ పత్రం అందజేశారు. అనంతరం నూతనగాఎన్నొకొబడిన అధ్యక్షులకి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సీలకు గోకులషెడ్‌ల మంజూరులో అన్యాయం

అట్టాడ సర్పంచ్ అమ్మన్నదొర ఆరోపణ



విశాలాంధ్ర-జామి: పశువుల షెడ్లు మంజూరులో నిభందనలను పాటించకుండా అధికారులు స్థానిక నేతల సిఫార్సుల మేరకు మంజూరు చేసారని మండలంలోని అట్టాడ గ్రామ సర్పంచ్ పోతల అమ్మన్నదొర ఆరోపించారు. తమ గ్రామంలో తీర్మాణాల మేరకు కాకుండా తమ ఇష్టానుసారంగా అధికార పార్టీ వత్తిళ్ళపై మంజూరులు చేసారన్నారు. చివరకు ఎస్సీలకు పశువుల షెడ్లు మంజూరులో ప్రాదాన్యత ఇవ్వాల్సి వుండగా వారికి మొండి చెయ్యి చూపించారన్నారు. అధికార పార్టీకి పూర్తిస్థాయిలో అనుకూలంగా అధికారులు వ్యవహరించారన్నారు.

పోయిన బంగారాన్ని వెతికించి బాధితులకు అప్పగింత



విశాలాంధ్ర-చీపురుపల్లి : పట్టణానికి చెందిన గుడ్ల ఇందిరా అనే మహిళ తన కుటుంబ సభ్యులతో శివరాం రోడ్ లో ఇంటికి వెళ్తుండగా తన రెండున్నర తులాల బంగారు గొలుసు. ఉంగరం మార్గమధ్యలో పోగొట్టుకున్నట్లు చీపురుపల్లి పోలీసు వరకు ఫిర్యాదు చేసింది. గుడ్ల ఇందిరా ఫిర్యాదు మేరకు చీపురుపల్లి పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా పోయిన బంగారాన్ని తీసుకున్న వ్యక్తులను గుర్తించి వారి వద్ద నుంచి బంగారు గొలుసును బంగారు ఉంగరాన్ని బంగారం పోగొట్టుకున్న గుడ్ల ఇందిరా కు శనివారం చీపురుపల్లి సీఐ ఎస్సై సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో చీపురుపల్లి సిఐ శంకర్రావు ఎస్సై ఎల్ దామోదర్‌రావు కానిస్టేబుల్ రమణ తదితరులు పాల్గొన్నారు. ..

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా రాజీనామా చేయాలి

- డిసెంబరు 30న నిరసన

- వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపు

విశాలాంధ్ర-బొబ్బిలి: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమాన కరమైన, వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా రాజీనామా కోరుతూ డిసెంబర్ 30వ తేదీన పట్టణం దక్షిణ దేవుడి సెంటర్ ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ వద్ద నిరసన దినం పాటించాలని వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. శనివారం సిఐటియు భవనంలో వామపక్ష ప్రజాసంఘ ఐక్యవేదిక నాయకులు విలేఖరి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ, సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. శంకర్రావు, భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ కార్యదర్శి , మునకాల శ్రీనివాసరావు, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వెలగాడి కృష్ణ మాట్లాడుతూ అంబేద్కర్ను అవమానించే వారిని, ఎగతాళి చేస్తూ అంబేద్కర్ జపం చేయడం ఫ్యాషన్ గా మారిందని ఆ జపం ఏదో దేవుడిని తలచుకుంటే స్వర్గమన్నా వచ్చేదంటూ అత్యంత అభ్యంతర కారమైన అమిత్ షా వ్యాఖ్యలపై తీవ్రంగా ఖండించాలని ప్రజలు, ప్రజాతంత్ర వాదులు ప్రజాసంఘాలను కోరారు. కేంద్రంలో బిజెపి మతోన్మాద మనువాద సిద్ధాంతాన్ని జీర్ణించుకున్న అమిత్ షా అనుచిత వ్యాఖ్యలపై దేశమంతా నిరసనలు వ్యక్తమవుతున్న కేంద్రంలో మతోన్మాద బిజెపి ప్రధాని నరేంద్ర మోడీ అమీషాకు మద్దతు పలకడం చూస్తే వీళ్ళ మనువాద సిద్ధాంతాన్ని తెచ్చి కుల,మత ఘర్షణలకు ప్రేరేపిస్తున్నట్లు కనబడుతుందని దేశానికి ఎంతో ప్రమాదకరమని ప్రజలు ప్రజాసంఘాల నాయకులు ఈనెల. 30న జరిగే నిరసన దినం కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల సిపిఎం పార్టీ కన్వీనర్ ఎస్. గోపాల్, రాంబద్రపురం మండలం సిపిఎం పార్టీ నాయకులు బలస శ్రీను, కళాసి సంఘం కార్యదర్శి ఎరబాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నాడు జగన్ చేసిన అవినీతి ఈ విద్యుత్తు భారం

-1,29 వేల కోట్ల రూపాయల అవినీతి

- ఎస్ కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర-లక్కవరపుకోట: నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేసిన అవినీతి ఒప్పందమే ఈ విద్యుత్తు భారమని ఎస్ కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 1, 29 వేల కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడి రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారం ఒప్పందం కుదుర్చుకున్నారని ఆమె అన్నారు. ఆనాటి పాలనలో 8సార్లు రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచి భారం మోపారని అన్నారు. అంతకుముందు చంద్రబాబు పాలనలో విద్యుత్ ఛార్జీలు జోలికి పోకుండా రాష్ట్ర ప్రజలకు విద్యుత్ కాంతులు వెలిగే విధంగా శస్యశ్యామలమైన పాలనను అందించారని ఆమె తెలిపారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో ఏ శాఖ చూసినా అవినీతిమయంగా కనిపిస్తుందని అతను చేసిన అవినీతి అక్రమాలను కారణంగా రాష్ట్రం అట్టడుగు వెళ్లిందని అవన్నీ గాడిలో పెట్టడానికి చంద్రబాబు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని అన్నారు. పిల్లాడిని ఉయ్యాలలో వేసి గిల్లేసి ఏమీచేయనట్టు బుజ్జగించినట్లు జగన్ విధానమని ఉందనిఅన్నారు. అప్పటి జగన్ ప్రభుత్వ పాపమే ఇప్పుడు ఈ విద్యుత్ శాపంగా తగిలిందని అన్నారు రాష్ట్ర ప్రజలు జగన్ అవినీతి అక్రమాలను గమనించి అప్పటి అవినీతిని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు బయట పెట్టడం వలన తమకు తెలియనట్టు ఈ ప్రభుత్వంపై మరో జల్లే పనిగా పెట్టుకుందని ఇకపై ఈ ఆరోపణలు చేయడానికి చెల్లుచీటీ చెరిగిపోయే విధంగా ఉందని భవిష్యత్తులో వైసీపీ ప్రభుత్వానికి ఇంక మార్గము లేదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చొక్కాకుల మల్లు నాయుడు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర- మెరకముడిదాం: మండలంలో గొట్టుపల్లి, శ్యామయవలస గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు శనివారం నిర్వహించరు. రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తహసిల్దార్ అజు రఫీ జాన్ తెలి పారు. మొటేషన్లు, పోతి కేసులు సంబంధించిన రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను, కొన్ని త్వరితగతిన, మరి కొన్ని 45 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు.రెవెన్యూ సదస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా తహసిల్దార్ తెలియపరిచారు. ఈ కార్యక్రమం లో రెవెన్యూ డిటి, మండల సర్వేర్, విలేజ్ సర్వేర్, గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర గజపతినగరం: గజపతి నగరం మండలం మధుపాడ గ్రామంలో ఇటీవల జరిగిన దొంగతనంలో తెన్నేటి నరసింహుమూర్తి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గజపతినగరం పోలీస్ స్టేషన్ ఎస్ఐ కే లక్ష్మణరావు సిబ్బంది సత్యనారాయణ తిరుపతిరావు రామకృష్ణ లు ఈ కేసును వెంటనే సేధించి ఆదివారం ముద్దాయిని అరెస్టు చేశారు. నరసింహమూర్తి ఇచ్చిన ఫిర్యాదుల మూడు కేజీలు వెండి రెండు కేజీలు ఇత్తడి సామాన్లు ఒక శాంసంగ్ టీవీ హుండీ హుండీలో పదివేల రూపాయలు క్యాష్ పోయిందని తెలిపారు. అనంతరం శనివారం మధుపడ పాల్దారి చెరువు వద్ద దొంగలు పంచుకుంటున్న సమాచారం తెలిసి వెంటనే వెళ్లి తూముల బాలయ్య అరెస్టు చేసి వారి దగ్గర ఉన్న మూడు కేజీలు వెండి రెండు కేజీల ఇత్తడి సామాన్లు సాంసంగ్ టీవీ హుండీ చిల్లర డబ్బులు స్వాధీనం చేసుకున్నారు దీంతోపాటు ఇద్దర మైనర్లు ఉన్నట్లు గజపతినగరం సీఐ జీవివి రమణ తెలిపారు. ముద్దాయిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలిస్తున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో ఎస్సై లక్ష్మణరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు రబీ క్రాప్ ఇన్సూరెన్స్ చేసుకోవాలి:మధు

విశాలాంధ్ర-రాజాం: ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు రాష్ట్ర రైతాంగం కుదేలైన సంగతి తెలిసిందే, కావున ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్బివై) పథకం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం రబీ సీజన్లో వరి, పెసర, మినుములు, మొక్కజొన్న, నువ్వులు, మొదలగు పంటలను సాగు చేస్తున్న రైతాంగం ఈ డిసెంబర్ 31వ తేదీ లోపల "రబీ క్రాప్ ఇన్సూరెన్స్" చేసుకోవాలని కోరారు, తద్వారా ప్రకృతి వైపరీత్యాల సంభవించినప్పుడు జిల్లా రైతాంగం నష్టపోకుండా ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసుకుని వెసులుబాటు ఉంటుందన్నారు. భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మిత్తిరెడ్డి మధుసూధనరావు ఒక ప్రకటనలో తెలిపారు.

పాటూరు పాఠశాల విధులు నిర్వహణ బేష్

జిల్లా మోనిటరింగ్ సిబ్బంది ఏం రామకృష్ణ

విశాలాంధ్ర-వేపాడ: పాఠశాల నిర్వహణ ఉపాధ్యాయుల విధులు నిర్వహణతో విద్యార్థులు విద్యపై ప్రత్యేకమైన దృష్టి సారించి విద్యనభ్యసించడం ఆనందనీయ మని జిల్లా మోనటరింగ్ డైట్ సిబ్బంది ఎం. రామకృష్ణ,వి.భారతి అన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని పాటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను తరగతిగదులు విద్యార్థుల ప్రవర్తన తీరును పాఠశాల వాతావరణం పరిశీలించారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటగది పరిసర ప్రాంతాలు విద్యార్థుల సామర్థ్యాలు విద్యార్థులు తయారు చేసినటువంటి టీఎంను వర్క్ బుక్ లు మొదలగుడివి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ వి. భాస్కరరావు సి ఆర్ పి కోటేశ్వరరావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మధ్యాహ్నం భోజన పథక నిర్వాహకులు పాల్గొన్నారు.

పలు మోసాలపై సంకల్ప రథం ద్వారా అవగాహన

విశాలాంధ్ర-భోగాపురం: సమాజంలో జరిగే వివిధ మోసాల పట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సంకల్ప రథం ద్వారా అవగాహన కార్యక్రమం మండలంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక నియంత్రణ, సైబర్ నేరాలు పై అవగాహన, రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణలు గురించి అవగాహన కల్పించారు. భోగాపురం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కస్తూరిబా విద్యాలయం, కొమ్మూరు అప్పుడు దొర జూనియర్ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్పరిణామాలు గురించి అవగాహన కల్పించారు. అలాగే భోగాపురంలో ముక్కం జంక్షన్, గాంధీ బొమ్మ ఊడలి వద్ద గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎస్ వి ప్రభాకర్, మహిళా ఎస్సై సూర్యకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధి భవిష్యత్తు కార్యాచరణ పై శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర- శృంగవరపు కోట రూరల్ : వెలుగు శాఖ ఆధ్వర్యంలో ఎస్.కోట స్థానిక మండల అభివృద్ధి వారి కార్యాలయంలో మహిళల అభివృద్ధికి మరియు వారి పురోగతికి దృష్టిలో పెట్టుకొని విద్య వైద్యం విద్యుత్తు వ్యవసాయం వ్యాపారం వంటి రంగాలలో మహిళలు అభివృద్ధిలోకి రావాలని ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో మహిళలు అంతా సుస్థిర అభివృద్ధిని సాధించుకోవడానికి వీలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుచున్నట్లు వెలుగు అధికారి రమణ తెలియజేశారు. ఇక్కడ శిక్షణ పొందినటువంటి వివోఏలు మరియు గ్రామీణ స్వయం సంఘాల నుండి విచ్చేసినటువంటి మహిళలు వారి వారి గ్రామాల్లో ఉన్న మహిళలకు శిక్షణలలో నేర్చుకున్నటువంటి విషయాలను తెలియజేసితద్వారా చైతన్యవంతమైనటువంటి విధానాలతో మహిళల అభివృద్ధి కొనసాగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండలంలో ఉన్నటువంటి వివోఏ లు మరియు సీసీ లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

తహశీల్దార్‌కు మానవహక్కుల సంఘం నేత ఫిర్యాదు

విశాలాంధ్ర-జామి: మండల కేంద్ర మైన జామి రెవెన్యూకు సంభందించి ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని, వెంటనే ప్రభుత్వ భూములను ఆక్రమణ చెరనుంచి విడిపించాలని మానవహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తలి గౌరినాయుడు రెవెన్యూ సిబ్బందిని కోరారు. ఈమేరకు శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆయన అందుబాటులో ఉన్న ఆర్ఐ సృజనకు వినతి పత్రాన్ని అందజేసారు. జామిలోని పలు సర్వే నెంబర్లలలో ఉన్న ఆక్రమణలను ఆదారాలతో పాటు వినతి పత్రాలలో పేర్కొనగం జరిగిందని గౌరినాయుడు తెలిపారు. రెవెన్యూ పరంగా చర్యలు తీసుకోకపోతే ఆక్రమణలపై ఉన్నతాధికారులను కలవడం జరుగుతుందన్నారు.

ఫోర్ట్‌సిటీ స్కూల్‌లో వైభవంగా లెర్నింగ్‌ఫెస్ట్-2024

విశాలాంధ్ర -విజయనగరం టౌన్: పట్టణంలోని రింగ్‌రోడ్‌లో ఉన్న ఫోర్ట్‌సిటీ పాఠశాలలో శనివారం లెర్నింగ్ ఫెస్ట్-2024 ఉత్సవాలను పాఠశాల యాజమాన్యం వైభవంగా నిర్వహించింది. ఈకార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా సిబిఎస్ఇ విద్యార్థులు కలిపి దాదాపు 800 ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు తమ సృజనాత్మకతను వారం రోజుల్లో తయారు చేసి ఈప్రదర్శనల ద్వారా నిరూపించారు. ఈ లెర్నింగ్ ఫెస్ట్‌లో విద్యార్థులు ఉపాధ్యాయులుగానూ, తల్లిదండ్రులు విద్యార్థులుగానూ తమ పాత్రలను పోషించారు. గణితం, సైన్స్‌కు సంభందించిన ప్రాజెక్టులు మాత్రమే కాకుండా తెలుగు, హిందీ, ఇంగ్లీషు, సోషల్, కంప్యూటర్, వ్యాయామం, ఎటిఎల్, సంగీతం, ఆర్ట్స్, డాన్స్ తదితర అంశాలపై విద్యార్థులు వివరించారు. పాఠశాల చైర్మన్ కె.ఎ.పి.రాజు(శివ) విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించి, వాటిపై ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. తెలుగు సబ్జెక్ట్‌కు సంభందించి శక్తి పీఠాలు, బ్రెయిలీ లిపి,వివిద రాష్ట్రాల వేషదారణ, సంస్కృతిలు వాటి ప్రాముఖ్యతపై వివరించారు. ఈలెర్నింగ్ ఫెస్ట్‌లో వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ డా. రీయినా ఖాన్, డైరక్టర్‌లు మధు, అశోక్ నీలిమా, పాల్గొన్నారు.

పెద దుంగాడ రెవెన్యూ సదస్సులో 11దరఖాస్తులు

తహసిల్దారు రాములమ్మ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని వీలుపర్తి పంచాయతీ శివారు పెద దుంగాడ గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 9 దరఖాస్తులు రైతుల నుండి అందాయని తహసిల్దార్ జె.రాములమ్మ అన్నారు.ఈ దరఖాస్తులు పట్టాదారు పాసుపుస్తకాలు, మంజూరు (ముటేషన్) పట్టాదారు పాస్ పుస్తకాలు ఆన్లైన్ కొరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సేనాపతి లీల అప్పారావు,గ్రామ పెద్దలు కొప్పల అప్పారావు, ఉగ్గిన ఈశ్వర రావు,కోప్పల నరసింహా మూర్తిలతో పాటు అటవీ శాఖ అధికారి రాజేశ్వరి,డిప్యూటీ, తహసిల్దార్, కే.సన్యాసినాయుడు, ఆర్ఐ.రామలక్ష్మి, మండల సర్వేయర్ గంగాధర్, సబ్ రిజిస్టర్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కె.నూకరత్నం వీఆర్వోలు శ్రీనివాస్, మిరియాల ఈశ్వరావు, డెక్కప్రసాదు, తాతారావు, బి.సన్యాసినాయుడు, అప్పారావు, అప్పలరాము, వీఆర్ఏలు గుమ్మాల రాము అశోక్, సచివా లయ సర్వేయర్లు అరవిందు నవీన్ సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

జనవరి 3న జిల్లాలో 3,857 గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు

కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం : రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 3న లక్ష గృహ ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దీనిలో భాగంగా జిల్లాలో 3,857 గృహప్రవేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ వెల్ల డించారు. ఈ మేరకు జిల్లాకు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. గృహప్రవేశాలకు పూర్తయిన ఇళ్లకు సంబంధించి చిన్నచిన్న పనులు ఏవైనా మిగిలి వుంటే వెంటనే వాటిని పూర్తిచేసి అన్ని వసతులతో ప్రవేశాలకు సిద్ధంచేయాలని గృహనిర్మాణ సంస్థ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని గృహనిర్మాణ శాఖ ఏ.ఇ., డి.ఇ.లతో కలెక్టర్ శనివారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రారంభించే ఇళ్లన్నింటినీ ఏ.ఇ., డి.ఇ.లు తనిఖీ చేయాలన్నారు. గ్రామాల వారీగా ప్రారంభించే ఇళ్ల జాబితాను ఆయా ప్రాంత ప్రజాప్రతినిధులకు అందజేయాలని గృహనిర్మాణ సంస్థ అధికారులకు సూచించారు. సమావేశంలో గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ కూర్మినాయుడు, ఇ.ఇ. శ్రీనివాస్, డి.ఇ. మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పాపం జగన్ దే

- వారే పెంచి, మళ్లీ నిరసనలు చేయడం సిగ్గుచేటు
- కరెంట్ చార్జీలు పెంపు,కూటమి ప్రభుత్వానికి సంబంధం లేదు
- రాష్ట్రాన్ని శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టడమే లక్ష్యం
- టీడీపీ జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున

విశాలాంధ్ర-చీపురుపల్లి: వైకాపా హయాంలో పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా.. ఆ పార్టీ నేతలే నిరసన చేయడం సిగ్గు చేటు అని విజయనగరం జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. విద్యుత్ చార్జీల పెంపు పాపం జగన్ దేనని తెలిపారు. ఇప్పుడు ఏమీ ఎరగనట్లు నిరసనలు చేయడం వారికే చెల్లిందని విమర్శించారు. తన పాలనలో రాష్ట్ర విద్యుత్ రంగంపై దాదాపు లక్షా 30 వేల కోట్ల రూపాయల భారాన్ని జగన్ మోపింది నిజం కాదా? అని ప్రశ్నించారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాగార్జున మాట్లాడారు. యూనిట్‌కు ఐదు రూపాయలకు దొరికే విద్యుత్‌కు బదులు రూ.8 నుంచి 14 రూపాయల వరకు కొనుగోలు చేసి ప్రజలపై జగన్ రెడ్డి మోయలేని భారాన్ని మోపారన్నారు. సోలార్, విండ్ ఎనర్జీ పీపీఎలను రద్దు చేసి రాష్ట్రానికి 10 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తును అందుబాటులో లేకుండా చేశారని దుయ్యబట్టారు. 2022 నుంచి 2024 వరకు రెండేళ్ల కాలానికి రూ.17 వేల కోట్ల ట్రూఅప్ చార్జీలను పెంచాలని అనాడే జగన్ సర్కార్ ఆమోదించిందని గుర్తు చేశారు. ఆ ట్రూ అప్ చార్జీలనే ప్రస్తుతం డిసెంబర్ నుంచి అమలు చేయాలంటూ ఈఆర్సీ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. తాను పెంచాలని సూచించిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా.. తానే పోరాటం చేయడం తుగ్లక్ జగన్‌కు మాత్రమే చెల్లిందని విమర్శించారు. గత ఎన్నికల్లో 11 సీట్లే ఇచ్చి, ప్రజల చేతిలో క్షవరం అయినా జగన్ రెడ్డికి, వైసీపీ నేతలకు తత్వం బోధపడలేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వానికి పెరుగుతున్న ప్రజల మద్దతు చూసి, ఓర్వలేక కొత్త డ్రామాలకు తెరలేపారన్నారు. ఐదేళ్లలో దాదాపు 10 సార్లుకు పైగా విద్యుత్ చార్జీలు పెంచి, ప్రజల నడ్డివిరిచి మరీ జగన్ రూ.32,166 కోట్లు దండుకున్నారని ఆరోపించారు. తన పాలనలో జగన్ విద్యుత్ సంస్థలపై వేసిన అప్పులే రూ. 50 వేల కోట్లు అని తెలిపారు. అస్తవ్యస్త నిర్ణయాలు, అవినీతి, అత్యాశతో రాష్ట్రాన్ని, విద్యుత్ రంగాన్ని నాశనం చేసిన ఘనత జగన్ దే అని వెల్లడించారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతోనైనా వైకాపా వారికి బుద్ధి రాలేదని. కరెంట్ చార్జీల పెంపుపై ర్యాలీలు చేయడం హాస్యాస్పదంగా ఉందని నాగార్జున అన్నారు. కరెంట్ చార్జీల పెంపునకు, కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రజలను మభ్యపెడుతూ అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. జగన్ రెడ్డికి ప్రజా సమస్యలపై మాట్లాడే అర్హత లేదన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా ఎన్నో డ్రామాలు ఆడతారో చూడాలన్నారు. ఎన్ని పిల్లిమొగ్గలు వేసినా ప్రజలు ఆయన్ని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఈ తుగ్లక్ డ్రామాలకు నవ్వుకుంటున్నారని ఎద్దేశాచేశారు. ఆయన గాల్లో వచ్చి, గాల్లో తిరిగారని, ఎన్నడూ రోడ్డు మీదనడవలేదని మండిపడ్డారు. జగన్ చేసిన పాపాలు శాపాలై ప్రజలను వెంటాడుతున్నాయని తెలిపారు. ఆ పాపాలను కడిగేస్తూ.. రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. 2014-19లో ఏపీని విద్యుత్ మిగులు రాష్ట్రంగా సీఎం చంద్రబాబు తీర్చిదిద్దారని గుర్తు చేశారు. తమ నాయకుడి సమర్థ నాయకత్వానికి ఇది నిదర్శనమని అన్నారు. 6 నెలల కాలంలో తమది మంచి ప్రభుత్వమని నిరూపితమైందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం నెరవేర్చుతోందని తెలిపారు. ఛిద్రమైన రహదారులను బాగు చేస్తున్నామని తెలిపారు. పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో రాబోయే సంక్రాంతి నాటికి పల్లెల్లో రోడ్లన్నీ నిర్మిస్తున్నామన్నారు. అటు అభివృద్ధిని, ఇటు సంక్షేమాన్ని సీఎం చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ పరుగులు పెట్టిస్తున్నారని, అది చూసి ఓర్వలేక జగన్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలంతా గుర్తిస్తున్నారని నాగార్జున చెప్పారు. జగన్ ఎన్ని కుట్రలు చేసినా.. ఈ రాష్ట్రాన్ని శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెడతామని స్పష్టం చేశారు.

ప్రభుత్వం అందించనున్న శిక్షణను సద్వినియోగంచేసుకోండి : కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : వివిధ రకాల చేతి వృత్తులలో పనిచేస్తున్న వారి నైపుణ్యాల అభివృద్ధి కొరకు ప్రభుత్వం అందించనున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో అనుభవం గల ప్లంబింగ్, కార్పెంటరీ, ఎలక్ట్రిషన్, ఏసీ, గీజర్, టీవీ, వాటర్ ప్యూరిఫైయర్, రిఫ్రిజిరేటర్ వాషింగ్ మిషన్ మరమ్మతులు చేసేవారు, సెలూన్,బ్యూటిషన్ కోర్సులు చేసేవారు మరింత నైపుణ్య అభివృద్ధి కోసం ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఇందుకుగాను జనవరి 2వ తేదీ లోపు మెప్మా విభాగంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు పరిశీలన అనంతరం శిక్షణ ఇచ్చి నైపుణ్యాభివృద్ధి కల్పించి ప్రశంసా పత్రాలను కూడా అందజేస్తామన్నారు. అవసరమైన వారికి పనిని కూడా కల్పిస్తారని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు దరఖాస్తు తో పాటు జత చేయాలన్నారు. మెప్మా మరియు హెరాం ట్రయాంగిల్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్స్ తొలిదశ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తుల స్వీకరించుటకు జనవరి 2 న ఆఖరి తేదీ అని వెల్లడించారు. ఆసక్తి గల వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు నగరపాలక సంస్థ కార్యాలయం పక్కన ఉన్న మెప్మా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ విభాగంలో సంప్రదించవచ్చని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ వద్దు.. ఐక్యతే ముద్దు

రాష్ట్ర దళిత సంఘ నేతలు

విశాలాంధ్ర-వంగర : ఎస్సీ వర్గీకరణ వద్దు,ఐక్యతే ముద్దనీ ఈ రాష్ట్ర పోరాట కమిటీ,రాష్ట్ర సామాజిక న్యాయ సమితి కార్యదర్శి మజ్జిగణపతి, దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.గణపతి అన్నారు. శనివారం వంగర బస్ స్టాండు లో అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో,మోకాలు పై కూర్చొని నిరశిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ ను నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ కులాలను వర్గీకరిస్తూ రాజ్యాంగ విరుద్ధంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తక్షణం ఉపసంహరించుకోవాలని కోరారు.రాజ్యాం గంలోని ఆర్టికల్ 341,342లకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు కుట్ర పూరితంగా ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపుతూ ఎస్సీ, ఎస్టీ కులాల ఐక్యతకు భంగం కలిగించే విధంగా చిచ్చు పెడుతున్నారనిఆరోపించారు. వర్గీకరణ చేసే హక్కు కేవలం పార్లమెంటుకు మాత్రమే ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణపై 2005లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిగణలోనికి తీసుకోకపోవడం చూస్తే నేటి తీర్పు రాజకీయ కుట్రలో భాగమని స్పష్టమవుతుందన్నారు.విభజన వద్దూ ఐక్యతే ముద్దు అంటూ నిరసనకారులు నినాదాలు చేశారు. రాష్ట్ర ఎస్సీ కులగణన ఆడిట్ నువెంటనే నిలుపుదల చేసి, తక్షణమే ఇంటింటి కులగణన చేపట్టాలనీ రాష్ట్ర దళిత నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామవార్డ్ సచివాలయంలోప్రదర్శించిన ఎస్సీ కులగన ఆడిట్ తప్పులను సవరించాలని, తక్షణమే ఇంటింటి కులగణను సర్వే చేపట్టాలని వంటి పలు నినాదాలు చేశారు. రాష్ట్రంలోనే అన్ని జిల్లాల్లో ప్రదర్శించిన కులగన ఆడిట్ తప్పులతడగ్గా ఉందని దీంతో మాలలంతా తీవ్ర అన్యాయం గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం గణపతి రావు మాట్లాడుతూ గ్రామాల్లో ఏ సచివాలయానికి /వార్డుల కెళ్ళినా కులం పేసచివాలయానికి /వార్డుల కెళ్ళినా కులం పేరు తప్పుగాను, నివసించిన వారి పేర్లు లేకపోవడం ఇంటి పేర్లు తప్పులు దొర్లడం వంటే పలు రకాల తప్పులు సుస్పష్టంగా కనిపిస్తున్నాయని వివరించారు. ప్రభుత్వం తక్షణమే ఎస్సీ కుల గణన ఆడిట్ ను నిలుపుదల చేసి ఇంటింటి కులగణ న చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గల గ్రామ వార్డు సచివాలయంలో ఎస్సీ కుల జనాభా ఆడిట్లో ప్రదర్శనలో శుద్ధ తప్పులుగా ఉండడానికి నిదర్శనంగా కొన్ని వివరాలను వెల్లడించారు.ఉద్యోగం లేని వారిని,ఉద్యోగులుగా గుర్తించారని,చిన్న పిల్లలను పెండ్లయిన వారుగా నమోదు చేశారని,మండల కేంద్రం వంగర గ్రామం లో సగం కుటుంబాలు వివరాలు పొందుపర్చలేదని అవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎస్సీ కులాల ఆడిట్ 2024-25 ఆడిట్ ను నిలుపుదల చేసి వెంటనే కొత్తగాఇంటింటి కులగణ న చేయాలని రాష్ట్ర దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈనెల 30లోగా ఆడిట్ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో తప్పులు తడకల సోషల్ ఆడిట్ వల్ల రాష్ట్రంలో ఎక్కువగా ఉన్న మాల కులాలు తో పాటు పైడి రెల్లి వంటి ఇతర కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది కనుక ఇంటింటి కులగణ చేయాలని ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. కార్యక్రమంలో దళిత నాయకులు చిత్తిరి గంగులు సిర్లిరాజు,ఎజ్జల సింహాచలం, రామారావు, సుధీర్ చంటి, పండు, చిన్న, ఉదయ్ రామ్, ఫకీర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు బలోపేతం కావాలి

ఏరియా కోఆర్డినేటర్ చిరంజీవి

విశాలాంధ్ర-రాజాం: మహిళా సంఘాలు బలోపేతం చేసేందుకు సిసిఎస్లు, ఎపిఎంలు చురుకుగా పనిచేయాలని చిరంజీవి ఏరియా కోఆర్డినేటర్, స్త్రీనిధి మేనేజర్ సుధాకర్ చెప్పారు. శనివారం వెలుగు రాజాం క్లస్టర్ పరిధిలో గల రాజాం, రేగిడి, సంతకవిటి, వంగర మండలాల్లోని సిబ్బందితో సమావేశం నిర్వహించి, పలు అంశాలపై చర్చించారు. ప్రొఫైల్సర్వే పై సమీక్ష జరిపారు. గ్రామసంఘం సమావేశాలకు సిబ్బంది హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గూర్చి వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం కె. హేమలత, టి. సీతారాం భవాని, గోవిందరావు, మంగమ్మ, దధికుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారం వైకాపాదే

విశాలాంధ్ర -రాజాం: విద్యుత్ ఛార్జీల భారం పెంపు పాపం వైకాపా ప్రభుత్వందేనని రాజాం టీడీపీ నాయకులు విమర్శించారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ సూచన మేరకు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోనాయకులు గురవాన నారాయణరావు, వల్లూరి గణేష్, కోటి, నాగిరెడ్డి సూరిబాబు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యుత్ రంగం ను పూర్తిగా నిర్వీర్యం చేసిన వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు నీతి వ్యాక్యాలు పల్లించడం దురదృష్టకరమన్నారు. స్మార్ట్ మీటర్లు లాంటివి తీసుకువచ్చి రైతులకు, ప్రజలకు అన్యాయం చేసిన వైకాపా నేతలు ఇప్పుడు విద్యుత్ ఛార్జీల భారం అని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

స్వర్ణాంధ్ర సాధన దిశగా అడుగులు వేద్దాం

నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలి - ఉపాధి కల్పించి ప్రజల ఆదాయాన్ని పెంచాలి - నైపుణ్య శిక్షణకు పెద్దపీట వేయాలి - 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మెన్ లంకా దినకర్ -ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష

విశాలాంధ్ర-విజయనగరం : ప్రభుత్వ పథకాలు సక్రమంగా వినియోగించుకొని స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన దిశగా అడుగులు వేయాలని 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంక దినకర్ పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలపాలని కోరారు. జిల్లా పర్యటనకు వచ్చేసిన ఆయన, శనివారం కలెక్టరేట్లో వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డ్వామా, పంచాయితీరాజ్ పనులు, అమృత సరోవర్, జలజీవన్ మిషన్, పిఎం జన్ మన్, పిఎం సూర్యఘర్, పిఎం కుసుమ్, లక్‌పతి దీది, డ్రోన్స్, గరీబ్ కల్యాణ్ అన్న యోజన, పిఎంఏవై, అమృత్ 2.0, సడక్ యోజన, నేషనల్ గోకుల్ మిషన్, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు, గిరిజన సంక్షేమం, కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ, భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు.ముందుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, జిల్లాకు సంబంధించిన అంశాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. వివిధ కార్యక్రమాల అమలు, తీసుకున్న చర్యలు, , లక్ష్య సాధన, భవిష్యత్ కార్యక్రమాలను అంకెలతోపాటు తెలియజేశారు. ఉపాధిహామీ కాంపోనెంట్ నిధులను మార్చిలోపు శతశాతం వినియోగించుకొనేందుకు కృషి చేస్తామన్నారు. రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని చెప్పారు. జిల్లాలోని ఎన్‌సి, ఎస్‌టి కుటుంబాలు సుమారు 51వేల మంది ఉన్నారని, వీరందరి ఇళ్లకు పిఎం సూర్యఘర్ పథకం క్రింద సోలార్ విద్యుత్ అందించేందుకు ప్రణాళికను రూపొందించామని చెప్పారు. పథకాల ప్రగతిని ఆయా శాఖాధిపతులు వివరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ, భారత దేశాన్ని విశ్వగురువుగా రూపొందించేందుకు, అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు ప్రధానమంత్రి మోది కృషి చేస్తున్నారని చెప్పారు. దీనిలో భాగస్వామ్యమై మన వంతు పాత్రను పోషించేందుకే ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ 2047ను ప్రకటించారని చెప్పారు. విజయనగరం లాంటి వెనుకబడిన జిల్లాలు అభివృద్ధిలో భాగస్వామ్యమైనప్పుడే, ఆ లక్ష్యం నెరవేరుతుందని, ఆ దిశగా ప్రభుత్వ శాఖలు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఉపాధిహామీ పథకం అమల్లో భాగంగా మరింత ఎక్కువ మందికి వంద రోజుల పనిదినాలను కల్పించాలని, అలాగే సగటు వేతనాన్ని రూ.300కు పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సుమారు రూ.1000 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ నిధులు మురిగిపోయాయని చెప్పారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా అందుబాటులో ఉన్న నిధులన్నీ పూర్తిగా వినియోగించుకొని అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. వచ్చే ఏడాది నుంచి ఏప్రెల్ నెల నుంచే మెటీరియల్ కాంపోనెంట్ నిధుల వినియోగాన్ని ప్రారంభించాలని సూచించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని, దాని అవసరాలకు తగ్గట్టుగా స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు సిద్ధం చేయాలని ఛైర్మన్ సూచించారు. అలాగే విమానాశ్రయం ద్వారా ఎగుమతులకు ఉన్న అవకాశాలపై ఇప్పటినుంచే దృష్టిపెట్టాలని చెప్పారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత త్రాగునీరు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలోని గత ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని పట్టించుకోకుండా నిధులను దుర్వినియోగం చేసిందని చెప్పారు. గత ప్రభుత్వ వైఖరి వల్ల ఈ పథకం వ్యయం రూ.70వేల కోట్లకు చేరిందన్నారు. అమృత్ పథకం ద్వారా పట్టణంలోని ప్రతీ ఇంటికీ కొళాయిల ద్వారా త్రాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే, తాటిపూడి నీటిని పూర్తిగా జిల్లాలోనే వినియోగించుకొనే అవకాశం లభిస్తుందన్నారు. పిఎం జన్ మన్, సడక్ యోజన నిధులను సక్రమంగా సకాలంలో వినియోగించుకొని గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు రహదారి సౌకర్యాన్ని కల్పించాలని చెప్పారు. లక్షపతి దీది కార్యక్రమంలో భాగంగా వీలైనంత ఎక్కువమంది డ్వాక్రా మహిళలను లక్షాదికారులను చేయాలని అన్నారు. శిక్షణ ఇవ్వడం ద్వారా ఉపాది అవకాశాలను విస్తృతం చేయాలని, పిఎం స్వానిధి లాంటి చిన్నచిన్న పథకాల ద్వారా వీలైనంత ఎక్కువమంది జీవన ప్రమాణాలను, ఆదాయాన్ని పెంచాలని సూచించారు. డ్రోన్‌లకు భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉంటుందని, వీటి విస్తరణపై దృష్టి సారించాలని సూచించారు. గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం క్రింద పేద ప్రజలకు బియ్యం పంపిణీ చేయడం జరుగుతోందని, అయితే తెల్లకార్డుల జారీలో పలు సంస్కరణలను చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. విద్యుత్ బిల్లులను తగ్గించేందుకు, సంప్రదాయ ఇంధన వనరులను ఆదా చేసేందుకు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ఒక వరమని అన్నారు. దీనిపై విస్తృత స్థాయిలో ప్రచారం చేయడం ద్వారా, వీలైనంత ఎక్కువమంది వినియోగించకొనేలా చూడాలని కోరారు. పిఎంఏవై పథకం క్రింద ఇళ్లు మంజూరు చేసినప్పటికీ, కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించినప్పుడే అవి వినియోగంలోకి వస్తాయని స్పష్టం చేశారు. ఆదిశగా అధికారులు పూర్తిస్థాయిలో ప్రణాళికలను రూపొందించాలని చెప్పారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయడంతోపాటుగా, యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చే కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచాలని, వారి జీవన ప్రమాణాన్ని మెరుగు పరచాలని ఛైర్మన్ దినకర్ కోరారు. సమీక్షా సమావేశంలో ఎంఎల్‌ఏలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, లోకం నాగ మాధవి, ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార సంస్థ ఛైర్ పర్సన్ కావలి గ్రీష్మ, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, తూర్పుకాపు ఛైర్‌పర్సన్ పాలవలస యశశ్వని, ఆర్‌టిసి ప్రాంతీయ ఛైర్మన్ దొన్ను దొర మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.బాలాజీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.